ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల జిల్లా వార్తలు

ఆదివారం 30 నవంబరు 2025

చివరి రోజు నామినేషన్ల జోరు

- ఐదు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

సిరిసిల్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో తొలి విడత నామినేషన్ల ఘట్టం చివరి రోజు జోరుగా సాగింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తొలి విడతలో రుద్రంగి, వేములవాడ, వేములవాడ రూరల్, కోనరావుపేట, చందుర్తి మండలాల్లో 85 సర్పంచ్, 748 వార్డులకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ శనివారం ముగిసింది. చివరి రోజు రాత్రి 10 గంటల వరకు నామినేషన్లు స్వీకరించారు. చివరి రోజు సర్పంచులకు 339 నామినేషన్లు, వార్డులకు 1324 నామినేషన్లు వచ్చాయి. మొత్తం 85 సర్పంచ్ స్థానాలకు 538 మంది అభ్యర్థులు. 748 వార్డు స్థానాలకు 1,695 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఐదు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఇందులో కోనరావుపేట మండలం కమ్మరిపేట తండా సర్పంచిగా భూక్య మంజుల ఏకగ్రీవం కాగా. రుద్రంగి మండలంలో 10 గ్రామపంచాయతీలు ఉండగా నాలుగు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. చింతమాణి తండా సర్పంచ్‌గా గూగులోతు సింధూజతో పాటు ఆరు వార్డులు ఏకగ్రీవం కాగా, రూప్లనాయక్ తండ సర్పంచ్‌గా భూక్య జవహర్‌లాల్, 8 వార్డులు, వీరునితండా సర్పంచ్‌గా గుగులోతు మంజులతో పాటు ఆరు వార్డులు ఎకగ్రీవమయ్యాయి. గైదిగుట్ట తండా సర్పంచ్‌గా ఇస్లావత్ కిషన్‌తో పాటు డమ్మీగా అతని భార్య నామినేషన్ దాఖలు చేశారు. దీంతో మండలంలో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

మండలం	సర్పంచ్	వార్డులు
రుద్రంగి	39	180
వేములవాడ	87	270
వేములవాడ రూరల్	98	335
కోనరావుపేట	202	513
చందుర్తి	112	397
మొత్తం	538	1,695

జోరుగా పల్లెపోరు



- నేడు రెండో విడత నోటిఫికేషన్
- 88 సర్పంచ్, 758 వార్డు సభ్యులకు ఎన్నికలు
- డిసెంబరు 2వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
- 14న రెండో విడత పోలింగ్



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పల్లె ఎన్నికలు జోరందుకున్నాయి. సిరిసిల్ల జిల్లాలో తొలి విడతలో ఐదు మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల పర్వం ముగిసిపోయింది. ఉపసంహారణలు, ఏకగ్రీవాల కోసం ఒక వైపు మంతనాలు జరుగుతుండగా మరోవైపు ప్రచారంలోకి అభ్యర్థులు అడుగుపెడుతున్నారు. రెండో విడతలో బోయిన్‌పల్లి, ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని 88 గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసి నవంబరు 30 నుంచి డిసెంబరు 2వ తేదీ నామినేషన్లు స్వీకరించనున్నారు. 3న పరిశీలన, 6న ఉపసంహరణకు అవకాశం ఇచ్చారు. 14న పోలింగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

ఇందుకోసం 27 క్లస్టర్ల ద్వారా నామినేషన్ల స్వీకరణకు సిద్ధం చేశారు. ఇల్లంతకుంటలో 11 కేంద్రాలు, బోయిన్‌పల్లిలో 6 కేంద్రాలు, తంగళ్లపల్లిలో 10 కేంద్రా లు ఏర్పాటు చేశారు. రెండవ విడతలో మూడు మండలాల్లో 88 సర్పంచ్‌లు, 758 వార్డు సభ్యులకు ఎన్నికలు జరుగనున్నాయి. బోయిన్‌పల్లి మండలంలో 23 సర్పంచ్‌లు, 212 వార్డులు ఉండగా, ఇల్లంతకుంట మండలంలో 35 సర్పంచ్‌లు, 294 వార్డులున్నాయి. తంగళ్లపల్లిలో 30 సర్పంచ్‌లు, 252 వార్డులు ఉన్నాయి.

రెండో విడతలో రిజర్వేషన్లు

జిల్లాలో 260 సర్పంచ్‌లు 2,268 వార్డులు ఉండగా రెండో విడతలో నాలుగు మం డలాల్లో 88 సర్పంచ్‌లు, 758 వార్డు సభ్యులకు నోటి ఫికేషన్ జారీ చేస్తున్నారు. 84 సర్పంచ్‌ల్లో రిజర్వేషన్లలో బోయిన్‌పల్లి మండలంలో 23 సర్పంచ్ స్థానాల్లో 11 మహిళలకు, 12 జనరల్‌కు కేటాయించారు. ఇందులో ఎస్టీ రిజర్వ్‌లేవు. ఎస్సీలకు 6 స్థానాలు ఉండగా 3 మహిళలకు, 3 జనరల్, బీసీలకు 5 స్థానాలు ఉండగా 2 మహిళలకు,3 జనరల్‌కు కేటాయించారు. జనరల్‌కు 12 స్థానాలు ఉండగా 6 మహిళలకు, 6 జనరల్ ఉన్నాయి. ఇల్లంతకుంట మండలంలో 35 సర్పంచ్‌ల్లో 17 మహిళలకు 18 జనరల్‌కు కేటాయిం చారు. ఎస్టీలకు స్థానాలు కేటాయించలేదు. ఎస్సీలకు 8 స్థానాలు ఉండగా 4 మహిళలు, 4 జనరల్, బీసీలకు 9 స్థానాలు ఉండగా మహిళలకు 4, జనరల్ 5, కేటాయించారు. 18 జనరల్ స్థానాల్లో 9 మహిళలకు 9 జనరల్ ఉన్నాయి. తంగళ్లపల్లి మండలంలో 30 సర్పంచ్‌ల్లో 14 మహిళలు, 16 జనరల్ ఉన్నాయి. ఇందులో ఎస్టీలకు స్థానాలు లేవు ఎస్సీలకు 6 స్థానాలు ఉండగా 3 మహిళలు, 3 జనరల్‌కు ఉన్నాయి. బీసీలకు 9 కేటాయించగా 4 మహిళలు, 5 జనరల్ ఉన్నాయి. 15 జనరల్ స్థానాల్లో 7 మహిళలు, 8 జనరల్ ఉన్నాయి. 758 వార్డుల్లో రిజర్వేషన్లలో 319 మహిళలకు, 439 జనరల్‌కు కేటాయించారు.

బోయిన్‌పల్లి మండలంలో 212 వార్డు స్థానాల్లో 92 మహిళలకు, 120 జనరల్‌కు కేటాయిం చారు. ఇందులో ఎస్టీ రిజర్వ్ లేవు. ఎస్సీలకు 56 స్థానాలు ఉండగా 23 మహిళలకు, 33 జనరల్, బీసీలకు 50 స్థానాలు ఉండగా 20 మహిళలకు,30 జనరల్‌కు కేటాయించారు. జనరల్‌కు 106 స్థానాలు ఉండగా 49 మహిళలకు, 57 జనరల్ ఉన్నాయి. ఇల్లంతకుంట మండలంలో 294 వార్డులు ఉండగా 122 మహిళ లకు,172 జనరల్ కేటాయించారు. ఎస్టీలకు స్థానాలు కేటాయించ లేదు. ఎస్సీలకు 62 స్థానాలు ఉండగా 24 మహిళలు, 38 జనరల్, బీసీలకు 85 స్థానాలు ఉండగా మహిళలకు 34, మిగతా 8వ పేజీలో

రెండో విడత గ్రామపంచాయతీ ఓటర్లు

మండలం	జీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు	మొత్తం
బోయిన్‌పల్లి	23	212	14753	15752	30505
ఇల్లంతకుంట	35	294	19644	20902	40546
తంగళ్లపల్లి	30	252	19395	20683	40078
మొత్తం	88	758	53792	57337	111129

ఐఎంఏ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం



డాక్టర్ శోభారాణిని సన్మానిస్తున్న వైద్యులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఐఎంఏ జిల్లా నూతన కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఐఎంఏ జిల్లా సమావేశంలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షురాలుగా డాక్టర్ వీ శోభారాణి, కార్యదర్శిగా డాక్టర్ అభినవ్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంను సభ్యులు శాలువా, మెమోంటోలతో సన్మానించారు. అనంతరం నూతన కార్యవర్గం సభ్యులతో ఎన్నికల అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉద్యోగులకు గుర్తింపు



సురేష్‌ను సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత, సిబ్బంది

సిరిసిల్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని, వైద్య,ఆరోగ్య శాఖలో కూన సురేష్ ఉత్తమ సేవలందించి అందరి మన్ననలు పొందారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. శనివారం సిరిసిల్లలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి కూన సురేష్ పదవీ విరమణ అభినందన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి నిర్మూలనలో తన వంతు కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించారని అన్నారు. ఈ సందర్భంగా సురేష్, సంగీత దంపతులను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, డాక్టర్ సుమన్ మోహన్ రావు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రమణారావు, డాక్టర్ రమేష్, డాక్టర్ అనిత డాక్టర్ నహిమా, ఏవో చేపూరి శ్రీనివాస్, రాచ విద్యాసాగర్ గురుస్వామి, ఎల్లంకి శ్రీనివాస్, చింతోజు భాస్కర్, రంగనేని మోహన్‌రావు, చేపూరి నాగరాజు తదితరులు ఘనంగా సన్మానించారు.

రైతులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ప్యాక్స్ చైర్మన్

ఇల్లంతకుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని ప్యాక్స్‌చైర్మన్ రొండ్ల తిరుపతి రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయ ఆవరణలో శనివారం ఏడుగురు రైతులకు రూ. 44లక్షల దీర్ఘకాలిక రుణాల చెక్కులను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సహకారంతో సంఘం పురోభివృద్ధి చెందుతుందన్నారు. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించినప్పుడే కొత్తవారికి రుణాలు అందుతాయని పేర్కొన్నారు. సంఘపరిధిలో ఇప్పటి వరకు దీర్ఘకాలిక రుణాల క్రింద రూ 15.67కోట్లు, స్వల్పకాలిక రుణాల క్రింద రూ 17.33కోట్ల రుణాలను అందించడం జరిగిందని పేర్కొన్నారు. సమావేశంలో డైరెక్టర్ కట్ట సుధాకర్‌రెడ్డి, సీఈఓ చిట్టి రవీందర్‌రెడ్డిలతో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయానికి ఎన్నికల సామగ్రి



చందుర్తి మండల కార్యాలయంలో ఎన్నికల సామగ్రి

చందుర్తి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ సర్పంచ్ , వార్డు సభ్యుల ఎన్నికల స్టేషనరీ, ఇతర సామగ్రి చందుర్తి మండల పరిషత్ కార్యాలయానికి చేరింది. మండ లంలో 19 గ్రామ పంచా యతీలకు సామగ్రిని సిద్ధం చేశారు. ఎన్నికల గైడ్‌లైన్స్, బ్యాలెట్ పేపర్లు, స్వాస్తిక్ ఎంబ్లం, వివిధ రకాల క్లాత్, ఎన్నికల సిబ్బంది వినియోగించే ఇతర స్టేషనరీ ఐటంలు కార్యాయానికి తరలించారు. సామగ్రిని కార్యాలయ సిబ్బంది పరిశీలించారు. మొదటి విడత ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలకు డిసెంబరు 10న సామగ్రి తరలిస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఇసుక రవాణా నిలిపివేశారని ధర్నా



నిరసన తెలుపుతున్న ట్రాక్టర్ల యజమానులు

తంగళ్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాకు అనుమతి ఇచ్చి అర్థంతరంగా నిలిపి వేయ డంతో ట్రాక్టర్ యజమానులు తంగళ్లపల్లి మండలం మండేపల్లి మానేరు నది తీరాన ధర్నా చేశారు. వే బిల్లులతో మండేపల్లి మానేరు నది నుంచి ఇసుక రవణాకు రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారు. శనివారం ఇసుక రవణా చేస్తుండగానే అర్థంతరంగా ఇసుక రవాణాను తహసీల్దార్ నిలిపివేశాడని ధర్నాకు దిగారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణగా కోరగా ట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా నడుపుతూ రైతుల పొలల వద్ద పైపులను ధ్వంసం చేశారని ఫిర్యాదులు అందాయన్నారు. ప్రస్తుతం లోడ్ చేసిన ట్రాక్టర్లకు అనుమతి ఇచ్చి రైతుల సమస్య పరిష్కరించాక అనుమతి ఇస్తామని తెలపడంతో ఆందోళన విరమించారు.

ఎన్నికల్లో ప్రలోభాలపై అధికారులు దృష్టి సారించాలి

- ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామ పం చాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్పంచ్, వార్డు సభ్యుల స్థానా లకు వేలం వేయడం, ప్రలోభాలకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడడం ఇతర అంశాల పరిశీలనకు జిల్లా స్థాయి స్పెషల్ మానిటరింగ్ సభ్యులు దృష్టి సారించాలని జిల్లా ఇన్‌చార్జీ కలెక్టర్ గరిమ అగ్రవాల్ అదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయంలో శనివారం జిల్లా స్థాయి స్పెషల్ మానిటరింగ్ సమావేశాన్ని స్పెషల్ మానిటరింగ్ సెల్ చైర్మెన్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్‌తో కలిసి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు వేలం వేయడం, ప్రలోబాలకు గురిచేయడం, బెదిరింపులకు పాల్పడడం ఇతర అంశాలకు సంబంధించి ఫోన్ కాల్స్ రాతపూర్వక ఫిర్యాదులు స్వీకరించి జిల్లా స్థాయి స్పెషల్ మానిటరింగ్ సెల్ ఆధ్వర్యంలో పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో మానిటరింగ్ సెల్ కన్వీనర్ డీఆర్డీఓ శేషాద్రి, సభ్యులు జడ్పీసీఈవో వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా విద్యార్థుల ప్రతిభ

- జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య



సర్టిఫికెట్‌లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యార్థులు విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చూపారని జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రెండవ రోజు శనివారం విద్యార్థులు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో జిల్లా వ్యాప్తంగా ఐదు వందలకుపైగా వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థులు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో జిల్లాసైన్స్ అధికారి దేవయ్య మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తున్నారన్నారు. ఈ సంవత్సరం నిర్వహించిన సైన్స్ ప్రదర్శన నుంచి మరొకసారి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చి యంగ్ సైంటిస్టులుగా తయారు కావాలని అన్నారు. 25 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఇన్‌స్పైర్ విద్యావిజ్ఞాన ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కో-ఆర్డినేటర్ శైలజా, పద్మజ, సిరిసిల్ల మండల విద్యాధికారి దూస రఘపతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బూర సదానందం, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, కిషన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు దీక్ష దివస్ చరిత్ర తెలుసుకోవాలి

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- జిల్లా కేంద్రంలో దీక్ష దివస్



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో కేసీఆర్ చేపట్టిన అమరణ నిరాహార దీక్ష దొంగ దీక్ష అంటూ మాట్లాడిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ దీక్ష దివస్ చరిత్ర తెలుసుకోవాలని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రం బీఆర్ఎస్ భవన్ ఆవరణలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన దీక్ష దివస్ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులు వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నాయకలు ముందుగా వేదికపైన ఉన్న అమర వీరుల స్థూపం, తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడారు. స్వాంతంత్ర్యం కోసం దీక్షలు చేసిన మహాత్మా గాంధీ చేపట్టిన దీక్షలను కొందరు దొంగ దీక్షలన్నారని ఆరోపించారు. మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేస్తే ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తాత్కారం చేయడంతో పొట్టి శ్రీరాములు మరణించిన నాలుగు రోజులకు ఆంధ్ర రాష్ట్రం ఇచ్చాడని చనిపోక ముందు ఎందుకు ఆంధ్ర రాష్ట్రం ఇవ్వలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఇవ్వడంలో కూడా సోనియాగాంధీ ఆలస్యం చేయడం వల్లే వేలాది మంది తెలంగాణ బిడ్డలు చనిపోయారని సోనియాగాంధీ బలి దేవత అని రేవంత్‌రెడ్డి నాడు విమర్శించాడని అన్నారు. దగాపడ్డ తెలంగాణను విముక్తి చేయాలని కేసీఆర్ కంకణం కట్టుకొని 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి రాజకీయ పార్టీని స్థాపించి ఆర్టికల్ - 3 ప్రకారం కేసీఆర్ ఉద్యమాలు చేశారని అన్నారు. దేశంలోని 33 పార్టీలను కలసి పార్లమెంట్‌లో చర్చించే విధంగా కేసీఆర్ చేస్తే అప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ అడ్డుపడిందని ఆరోపించారు. కేసీఆర్ అమరణ నిరాహార దీక్షతో తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిందన్నారు. డిసింబర్ 9న తెలంగాణ రాష్ట్ర ప్రక్రియను ఆలస్యం చేయకుండా సోనియాగాంధీ మొదలు పెడితే ఇంత మంది బలిదానం చేసుకునే వారుకాదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల సమస్యలను ముందుకు తీసుకెళ్లాలన్నారు.

తెలంగాణ ఉద్యమంపై తుపాకి ఎక్కుపెట్టినోడు ఈరోజు పాలకుడైండని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆరోపించారు. మన పాలన కోసం ప్రాణాన్ని ఫలంగా పెట్టిన వ్యక్తి చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్ చైర్మన్ తిరుపతి, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మినారాయణ, జడ్పీ మాజీ చైర్ పర్సన్ నాల్యకొండ అరుణ, మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ మాజీ చైర్ పర్సన్స్ జిందం కళా, రామతీర్థం మాధవి, మాజీ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయం మాజీ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు29(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ సూపర్ మార్కెటులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష శనివారం తనిఖీలు నిర్వహించారు. నిత్యావసర సరుకులకు సంబంధించిన బిల్లులను పరిశీలించారు. కాలం చెల్లిన కారం పొడి ప్యాకెట్లను గుర్తించారు. నిర్ణీత గడువు ముగిసిన తినుబండారాలు, సరుకులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్ర స్థాయికి ఎంపిక

గంభీరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో గంభీరావుపేట మండలానికి చెందిన విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. ఇన్స్పైర్ మనక్ పోటీల్లో 90 ప్రాజెక్టుల్లో రాష్ట్ర స్థాయికి 9 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. అందులో గంభీరావుపేట మండలం నర్మాల గురుకుల సాంఘిక సంక్షేమ పాఠశాల నుంచి తయారు చేసిన ప్రాజెక్టు ఎంపికైంది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అనన్య తయారు చేసిన ఉమెన్ సేఫ్టీ, ట్రాకింగ్ సిస్టమ్ అనే ప్రాజెక్టు సెలక్ట్ అయింది. అదే విధంగా దమ్మన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వీరబోయిన నందిని, మూడ్ అక్షర తయారు చేసిన రోడ్ సేఫ్టీ కోన్ అనే ప్రాజెక్టు రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. అదే విధంగా ఇదే పాఠశాలకు చెందిన 10వ తరగతి చదవుతున్న ఈరవేని మధుప్రియ తయారు చేసిన దివ్యాంగుల మిత్ర, రుతు మిత్ర అనే ప్రాజెక్టు రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. గైడ్ టీచర్లు తాడూరు సంపత్‌కుమార్, నాగరాణిలను అభినందించి, ప్రశంసా పత్రాలు అందించారు.

గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్య

జమ్మికుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవపూర్‌కు చెందిన పాతకాల విజయరాణి(35) అనే వివాహిత గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. కేశవపూర్‌కు చెందిన పాతకాల కిరణ్ కుమార్‌కు మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణపూర్‌కు చెందిన విజయరాణితో 16ఏళ్ల క్రితం వివాహమైంది. కిరణ్‌కుమార్ పెయింటింగ్ పనిచేస్తున్నాడు. ఆడబ్బులు కటుంబ పోషణకు సరిపోవడం లేదని విజయరాణి తండ్రికి చెప్పుకుంటూ బాధపడేది. దీంతో తల్లి దండ్రులు ఈనెల27న కుమార్తెను చూసేందుకు కేశవపూర్‌కు వచ్చారు. 28న ఉదయంవారు ముందు గదిలో ఉండగా, విజయరాణి వెనుకగదిలో గడ్డిమందు తాగింది. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. విజయరాణికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె తండ్రి చంద్రయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తుచేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

మియాపూర్‌లో ఒకరి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామానికి చెందిన కొయ్యడ అరుణ్ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. కొన్నిరోజుల నుంచి వారి కుటుంబసభ్యుల మధ్య ఇళ్లు, భూముల పంచాయితీలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అరుణ్‌తో పాటు ఆయన భార్య మాజీసర్పంచ్ స్వప్నలపై అరుణ్ తల్లి పోలీసులకు పిర్యాదు చేసింది. అయితే ఈ విషయంలో తాము కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నామని, అయినా తమను పోలీసులు పిలిపిస్తుండడంతో మనస్తాపం చెందిన తన భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని అరుణ్ భార్య మాజీసర్పంచ్ స్వప్న వీడియో విడుదల చేసింది. తన భర్త ప్రస్తుతం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఆయన ఆత్మహత్యాయత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



బోల్తాపడిన ట్రాలీ వ్యాను

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కల్వల శివారులో ఆర్టీసీబస్సు.. ట్రాలీవ్యాన్‌ను ఢీకొంది. దీంతో ట్రాలీవ్యాన్ బోల్తాపడగా అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. కొలనూర్‌కు చెందిన ట్రాలీ వ్యాన్ మరమ్మతుల నిమిత్తం పెద్దపల్లికి వస్తోంది. పెద్దకల్వల డిగ్రీకళాశాల వద్ద యూటర్న్ తీసుకుంటుండగా కరీంనగర్‌కి వెళ్తున్న బస్ వెనుకనుంచి ఢీకొంది. దీంతోవ్యాన్‌లో ప్రయాణిస్తున్న డ్రైవర్‌వంశీకృష్ణ, రామరాజుకు తీవ్ర గాయాలు కాగా పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. రామరాజు సోదరుడు దీపక్ ఫిర్యాదుమేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

పాలకుర్తి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసంత్ నగర్ అల్ట్రాటెక్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. ఈసాల తక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన తీగల అనిల్‌కుమార్ ద్విచక్ర వాహనంపై బసంత్‌నగర్ బస్టాండ్ నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో అదుపు తప్పి అల్ట్రాటెక్ కంపనీ గోడకు ద్విచక్రవాహనం ఢీకొని కిందపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న అనిల్‌ను అటుగా వెళ్తున్న స్రవంతి అనే నర్సు సీపీఆర్ చేసింది. అనంతరం అతన్ని 108లో కరీంనగర్ తరలించారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

సుల్తానాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో దారుణం చోటు చేసుకుంది. ఓ మైనర్ బాలికను ఒకవ్యక్తి(వివాహితుడు)లోబరుచుకుని కొంతకాలంగా శారీరకంగా ఉపయో గించుకున్నాడు. బాధితుల పిర్యాదు మేరకు కేసు శనివారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. కాగా ఆవ్యక్తిపై గతంలోకూడా ఓచిన్నారి మృతికేసులో అనుమానాలు వ్యక్తమయ్యాయి. శనివారం కులపెద్దల వద్ద ఈ విషయం వెలుగుచూడగా బాలిక తరపువారు పోలీసులను ఆశ్రయించడంతో సదరు వ్యక్తిపై పోలీసులు పోక్సోకేసు నమోదు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



చింతకుంటలో దగ్ధమవుతున్న గుడిసె

కథలాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం చింతకుంటలో శనివారం షార్ట్‌సర్క్యూట్‌తో వేముల శంకర్ అనే వ్యక్తికి చెందిన గుడిసె దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. భారీగా అగ్నికీలలు ఎగిసిపడడంతో ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పివేసింది. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. సంఘటనా స్థలంను రెవెన్యూఅధికారులు పరిశీలించారు. కాగా బాధితకుటుంబానికి పలువురు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కోల్‌సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గోదావరిఖని వన్‌టౌన్‌సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం రాత్రి విఠల్‌నగర్‌లో పోలీస్‌కళాబృందం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యువత గంజాయి, డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎవరైనాగంజాయి అమ్మినా, కొన్నా సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీల్లో స్వీయ భద్రత కోసం కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ కాల్స్ లింకులు, ఓటీపీ మోసాల గురించి స్పష్టంగా ఉండాలని, మోసాలకు గురైతే వెంటనే 1930నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలు, గంజాయి, సైబర్‌మోసాలు, మైనర్ల డ్రైవింగ్‌పై కళాజాత బృందం ప్రజలకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్ఐ అనూష, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

నేటితో ముగియనున్న గడువు

- రేపటి నుంచి కొత్త మద్యం దుకాణాలకు అనుమతి
- డిపో నుంచి మద్యం కొనుగోలుకు అనుమతి



కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు నడుస్తున్న వైన్‌షాపు(ఏ4)ల లైసెన్స్ గడువు ఆదివారంతో ముగియనుంది. సోమవారం (డిసెంబరు 1) నుంచి కొత్త వైన్‌షాపులు అమ్మకాలు సాగించేందుకు 94 లైసెన్సీలకు అనుమతులను జారీ చేశామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు తెలిపారు. 2025 డిసెంబరు 1 నుంచి 2027 నవంబరు 30 వరకు రెండేళ్ల కాలంపాటు మద్యం అమ్మకాలు సాగించేందుకు అక్టోబరు 23న లాటరీ ద్వారా లైసెన్సీలను ఖరారు చేశారు. డిసెంబరు 1 నుంచి వైన్‌షాపుల్లో కొత్తగా లైసెన్స్‌లు పొందిన వ్యాపారులు మద్యం అమ్మకాలు సాగించేందుకు అనువుగా ఆదివారం కరీంనగర్ డిపో నుంచి మద్యం కొనుగోలుకు అనుమతులు ఇచ్చారు. ఆది వారం సెలవు దినం అయినా నెలాఖరు కావటంతోపాటు కొత్తగా ఏర్పాటు చేసు కున్న వైన్‌షాపులకు మద్యం సరఫరా చేసేందుకు మద్యం డిపో తెరచి ఉంచుతారు.

● ఎక్సైజ్ ఫీజు.. బ్యాంకు గ్యారెంటీలు

మద్యం షాపుల లైసెన్స్‌లు ఖరారు అయిన తరువాత 94 వైన్‌షాపులకు ఏడాదికి 55 కోట్ల 45 లక్షల రూపాయలు లైసెన్స్‌ఫీజుకాగా ఇందులో 6వ వంతు ఎక్సైజ్ ఫీజు 9 కోట్ల 24 లక్షల 17 వేల రూపాయలు లైసెన్స్‌దారులు ప్రభుత్వానికి చెల్లించారు. ఈ మేరకు ఎక్సైజ్ అధికారులు 94 వైన్‌షాపుల లైసెన్సీలకు మొదట కన్ఫర్‌మేషన్ లెటర్లు అందజేశారు. మిగతా లైసెన్స్‌ఫీజుకు 25 నెలల వాలిడిటీతో బ్యాంక్ గ్యారంటీలు ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు సమర్పించారు. వైన్‌షాపు ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తుల ఆధారంగా షాపు స్థలాన్ని ఎక్సైజ్ అధికారులు పరిశీలించారు. నిబంధనల ప్రకారం గుడి, బడికి వంద మీటర్ల దూరం, జాతీయ రహదారికి 220 మీటర్ల దూరం, షాపునకు ఆనుకుని వంద మీటర్ల విస్తీర్ణంలో పర్మిట్ గది, తాగునీరు, మూత్ర శాలలు, పార్కింగ్, సీసీ కెమెరాలు ఉ న్నాయని నిర్ధారించిన తరువాతనే 94 వైన్‌షాపులకు లైసెన్స్‌లను జారీ చేశారు. ఈ ప్రక్రియ శనివారంతో ముగిసింది. న వంబరు 30 రాత్రి 10 గంటలతో పాత షాపుల గడువు ముగియనుండగా ఆ షా పులకు సంబంధించిన మిగిలిపోయిన మ ద్యం స్టాక్‌ను డిపోకు అప్పగించాల్సి ఉంటుంది.

● కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం 94 వైన్‌షాపుల లైసెన్స్‌లు ఖరారు కాగా ఎక్సైజ్ శాఖకు ఏడాదికి 55 కోట్ల 45 లక్షల ఆదాయం సమకూరనున్నది. 11 వైన్‌షాపులకు 50 లక్షల వంతున 5.5 కోట్లు, మరో 40 వైన్‌షాపులకు 55 లక్షల వంతున 22 కోట్లు, 43 వైన్‌షాపులకు 65 లక్షల వంతున 27.95 కోట్ల రూపాయలు లైసెన్స్‌ఫీజు కింద సమకూరనున్నది. ఈ 94 వైన్‌షాపులు 5 లక్షల వంతున 4.7 కోట్ల రూపాయలు స్పెషల్ ఎక్సైజ్ టాక్స్‌తోపాటు, దరఖాస్తు ఫీజు రూపంలో 81.9 కోట్ల రూపాయలు, మొత్తం కలిసి మొదటి ఏడాదిలో 142.05 కోట్ల ఆదాయం సమకూరింది.

● కొత్తవారికి గుడ్‌విల్‌ఇస్తూ..

కరీంనగర్ జిల్లాలో 94 వైన్‌షాపుల్లో 25 శాతం షాపులు కొత్తవారికే రావడంతో ఆ షాపులను చాలావరకు మద్యం వ్యాపా రులు లక్షల్లో గుడ్‌విల్ చెల్లించి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఒక్కో వైన్‌షాపు డిమాండ్‌ను బట్టి 50 లక్షల నుంచి కోటి రూపాయల వరకు గుడ్‌విల్ చెల్లింపులు జరిగినట్లు సమాచారం. కొ త్తగా వైన్‌షాపులు పొందినవారికి అడ్డాలు లభించక కొంత ఇబ్బంది పడ్డారు. మరి కొందరు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు.

మావోయిస్టు నేత కాశీరాం లొంగుబాటు

● 1989లో భార్యతో సహా ఉద్యమంలోకి..



సింగరావుపేట గ్రామంలోని కాశీరాం ఇల్లు

రాయికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం సింగరావుపేట గ్రామానికి చెందిన మావోయిస్టు నేత బత్తుల కాశీరాం మహారాష్ట్ర పోలీసుల ఎదుట శుక్రవారం లొంగిపోయాడు. మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితులైన బత్తుల కాశీరాం, అతని భార్య మల్లవ్వలు ఇద్దరు కుమారులను విడిచిపెట్టి ఉద్యమంలోకి వెళ్లారు. మల్లవ్వ అనారోగ్యంతో ఉద్యమంలో ఉన్న సమయలోనే 2009లో చనిపోయింది. రాయికల్ మండలం సింగరావుపేట గ్రామానికి చెందిన బత్తుల పెద్ద రాజయ్య-పెద్ద గంగవ్వ దంపతులకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడైన కాశీరాం మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితుడై భార్య మల్లవ్వతో కలిసి 1989లో మావోయిస్టు ఉద్యమంలో చేరాడు. కాశీరాం, మల్లవ్వలు ఉద్యమంలో చేరే సమయంలో ఇద్దరు కుమారులు ఐదేళ్ల వయస్సు గల పిల్లలు.

ఇద్దరు చిన్న పిల్లలను వదిలి కాశీరాం దంపతులు ఉద్యమం బాట పట్టారు. అప్పటి నుంచి ఉద్యమంలో వివిధ హోదాల్లో వీరిద్దరూ పని చేశారు. ఉద్యమంలో ఉన్నసమయలో కాశీరాం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పలుమార్లు పిల్లల కోసమైనా జనజీవన స్రవంతిలో కలవాలని వేడుకున్నా వారు ఉద్యమాన్ని విడిచిరాలేదు. ప్రస్తుతం కాశీరాం పెద్ద కుమారుడు రాజేష్ హైదరాబాద్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తుండగా, అతని చిన్న కుమారుడు మహేష్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. మహారాష్ట్ర పోలీసులకు కాశీరాం లొంగిపోయాడన్న సమాచారం మేరకు అతడి తమ్ముడు మహాదేవయ్య మహారాష్ట్రకు వెళ్లాడు.

పోలీసుల అదుపులో చోరీకి పాల్పడిన యువకుడు?

● యువకుడికి ఫిట్స్.. ఆసుపత్రికి తరలింపు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్‌లో ట్రాలీ ఆటోను దొంగిలించిన అదే గ్రామానికి చెందిన యువకుడిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. విచారిస్తున్న క్రమంలో యువకుడికి ఫిట్స్ వచ్చి ఒక్కసారిగా కింద పడిపోయాడని తెలిసింది. ఆందోళనకు గురైన పోలీసులు పోలీస్ వాహనంలో మండల కేంద్రంలోని ఓ ఆసుపత్రికి తరలించారని సమాచారం. ఈ విషయంపై ఎస్ఐ రాహుల్‌రెడ్డిని వివరణ కోరగా వాహనం ఎత్తుకెళ్లారని బాధితులు తమ వద్దకు వచ్చారని పేర్కొన్నారు. బాధితుల సమీప బంధువు చోరీ చేయడంతో అతన్ని అదుపులోకి తీసుకుని మాట్లాడుతున్న క్రమంలో ఫిట్స్ రావడంతో అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారని ఎస్ఐ వివరించారు.

తల్లీకొడుకులకు కన్నీటి వీడ్కోలు

● చితికి నిప్పుపెట్టిన కుమార్తెలు

తంగళ్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన తల్లీ కొడుకులకు బంధువులు, మిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆత్మహత్యకు పాల్పడిన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన మంచికట్ల లలిత ఆమె కుమారుడు అభిలాష్ అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. తల్లి కొడుకుల మృతదేహాలను ట్రాక్టర్‌పై పక్కపక్కనే పెట్టి అంతిమయాత్ర చేపట్టగా దారి వెంట స్థానికులు కంటతడి పెట్టుకున్నారు. తల్లి లలిత చితికి పెద్ద కూతురు మౌనిక నిప్పుపెట్టగా, అన్నయ్య అభిలాష్ చితికి సోదరి మానస నిప్పుపెట్టింది. ఈ దృశ్యం బంధువులను, మిత్రులను కంటతడి పెట్టించింది.



అభిలాష్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న బెటాలియన్ కమాండెంట్ సురేష్

● నివాళులర్పించిన కమాండెంట్..

తంగళ్లపల్లిలో అభిలాష్ భౌతికాయానికి 17వ బెటాలియన్ కమాండెంట్ సురేష్‌తోపాటు కానిస్టేబుళ్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో, క్రమ శిక్షణతో పనిచేసిన సిబ్బందిలో అభిలాష్ ఒకరిగా నిలిచారని కొనియాడారు. ఆయన మృతి పోలీస్‌శాఖకు తీరనిలోటని పేర్కొన్నారు. అనంతరం అభిలాష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పథకం ప్రకారమే సిద్ధన్న హత్య

● ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి



హత్యకేసులో అరెస్ట్ అయిన సంతోష్

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలంలోని గుర్రవానిపల్లె ఎదురుగా ఉన్న అగ్రహారం గుట్టల్లో ఈ నెల 27న బల్లెపు నర్సయ్య అలియాస్ సిద్ధన్న హత్యకేసులో ప్రధాననిందితుడైన జక్కుల సంతోష్‌ను అరెస్టుచేసినట్లు వేములవాడ ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలప్రకారం... జిల్లాలోని తంగళ్ల పల్లిమండలం గండిలచ్చపేట గ్రామానికి చెందిన సిద్ధన్న అప్పటి పీపుల్స్‌వార్ దళ కమాండర్‌గా పనిచేశాడు. ఈసమయంలో వీర్నపల్లి బస్టాండ్‌వద్ద 1999లో జక్కుల అంజయ్యను పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా భావించి కాల్చివేసిన ఘటనలో అతనిపై ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ ఘటనపై అంజయ్య కుమారుడు జక్కుల సంతోష్ తనతండ్రిని చంపిన వ్యక్తిపై కక్షపెంచుకున్నాడు. దీంతో పథకం ప్రకారం సిద్ధన్నపై రాళ్లతో దాడిచేసి హత్యచేశాడు. ఈ ఘటనపై వేములవాడ పోలీస్‌స్టేషన్‌లో సంతోష్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తుచేపట్టగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని ఇంచార్జి డిఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. ఈ హత్య కేసును చేధించిన వేములవాడటౌన్ సిఐ వీరప్రసాద్, ఎస్ఐ రామ్మోహన్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రాజన్న కోడెల తరలింపుపై విచారణకు ఈవో ఆదేశం

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గతఏడాది జనవరిలో రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తిప్పాపూర్ గోశాల నుంచి నాలుగు కోడెలను అక్రమంగా తరలించిన వ్యవహారంలో విచారణ చేపట్టాలని శనివారం ఆలయఈవో రమాదేవి అధికారులను ఆదేశించారు. వేములవాడ దేవస్థానం గోశాలనుంచి మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని దుబ్బతండాకు చెందిన సోమేశ్వర గోసంరక్షణ సేవాసంఘం ఆధ్వర్యంలో వ్యాన్‌లో కోడెలను తరలిస్తుండగా జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ వద్ద అక్రమంగా తరలిస్తున్నారని బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆపేశారు. ఈ వాహనాన్ని కార్యకర్తలు తనిఖీచేసిన సందర్భంలో 24కోడెలు ఉన్నాయి. అయితే అనుమతి మాత్రం 20కోడెలకే ఉండడంతో మరో 4కోడెలు ఎక్కడివని బజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రశ్నించారు. అదనంగా నాలుగు కోడెలు ఉండడంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడ కేసు నమోదైంది. అదే సమయంలో ఇద్దరు ఆలయ ఉద్యోగులకు చార్జి మెమో జారీకి తదుపరి చర్యలకు ఆదేశించారు. ఈ వ్యవహారంలో శాఖాపరమైన సమగ్రవిచారణ చేపట్టాలని ఏఈవోను విచారణాధికారిగా నియమిస్తూ ఈవో ఆదేశాలు జారీచేశారు.

16 మంది బైండోవర్

కరీంనగర్ క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న వారితోపాటు గతంలో ఎన్నికల కేసులున్న పాత నేరస్తులు, సస్పెక్ట్‌షీటర్లు 16మందిని శనివారం బైండోవర్‌చేశామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. 4 కేసుల్లో 16మందిని స్థానిక తహసీల్దార్ ఎదుట హాజరు పరిచినట్లు, లక్షరూపాయల చొప్పున సొంత పూచీకత్తుపై బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన అడిషనల్ డీసీపీ

జమ్మికుంట రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంభునపల్లి శివారులో శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభించిన సంఘటనస్థలాన్ని అడిషనల్‌డీసీపీ వెంకటరమణ శనివారం పరిశీలించారు. 30-35సంవత్సరాల వయస్సు యువకుడిని హత్యచేసి గోనె సంచులు, చద్దర్లలోచుట్టి రోడ్డుపక్కన పత్తిచేనులో పడేశారు. యువకుడిని గుర్తించేందుకు అతడు ధరించిన దుస్తులు, చెవిపోగు, చేతికి కంకణాలు ఇతర ఆనవాళ్లను రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు పంపించినట్లు తెలిసింది. హత్య ఘటన వెలుగు చూడకముందు ఆ రోడ్డులో పెళ్లి భారత్‌లు జరిగాయని, పరిమల సొసైటీ రోడ్డులో నిత్యం అర్ధరాత్రివరకు ఆకతాయిలు మద్యం తాగుతారని స్థానికులు తెలిపారు. డీసీపీవెంట హుజూరాబాద్ ఏసీపీమాధవి,సీఐ రామకృష్ణగౌడ్ ఉన్నారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

వ్యవసాయ బావి మోటారు వైర్ చోరీ

వీణవంక, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్ వంగల కొండాల్‌రెడ్డికి చెందిన వ్యవసాయ బావి వద్ద స్టాటర్‌తోపాటు మోటర్‌వైరును శనివారం దొంగలు ఎత్తుకెళ్లారు. తరచూ మోటార్ల కాపర్‌వైర్ ఎత్తుకెళ్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోరుట్లలో రెండిళ్లలో చోరీ



దొంగలు ధ్వంసం చేసిన బీరువా

కోరుట్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని రవీంద్ర రోడ్డులో శుక్రవారం రాత్రి తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీ జరిగింది. సీసీ ఫుటేజీలకు ఉన్న వైర్లను తొలగించి దొంగలు ఇండ్లలో చొరబడి దొంగతనం చేశారు. రవీంద్ర రోడ్డులో నివాసం ఉంటున్న కటకం రాజారాం దంపతులు గురువారం ఇంటికి తాళంవేసి బంధువుల ఇంటికి వెళ్లి శనివారం ఉదయం తిరిగిరాగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారు అభరణాలు రూ. 25అపహరణకు గురయినట్లు బాధితుడు తెలిపాడు. అదేకాలనీకిచెందిన ఇలుటపు భూమయ్య తన చిన్న కుమారుడి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద కుమారుడి ఇంటి వద్ద నిద్ర పోయాడు. ఇంటి ముందర ఉన్న సీసీకెమెరా వైర్లను కట్‌చేసి దుండగులు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. భూమయ్య ఉదయం చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉన్న విషయం కుటుంబసభ్యులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లోని బీరువాలోఉన్న రెండుతులాల బంగారు అభరణాలు, మూడుతులాల వెండిఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్ఐ చిరంజీవి కేసునమోదు చేసి క్లూజ్‌టీంతో తనిఖీలు నిర్వహించారు. కాగా కత్తులతో ముగ్గురుదొంగలు ఆ ప్రాంతంలో సంచారం చేస్తునట్లు పోలీసులు సీసీపుటేజ్ ద్వారా గుర్తించారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మల్లాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతారం గ్రామ శివారులో పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నారు. శనివారం చిట్టాపూర్ గ్రామశివారులో చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



చిట్టాపూర్ శివారులో పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్లు

మద్యం పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని సీతంపేటకు చెందిన బోయిని అశోక్ వద్ద నిల్వ ఉన్న రూ.27వేల విలువైన మద్యాన్ని శనివారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. సీతంపేటలో తనిఖీలు నిర్వహిస్తుండగా, గ్రామానికి చెందిన అశోక్ మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందింది. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు, అతడిపై కేసునమోదు చేసినట్లు ఎస్సైక్రాంతికుమార్ తెలిపారు.

కథల పోటీలో 'మూఢనమ్మకాలు'కు చోటు



విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈవో ప్రభాకర్

ధర్మారం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన కథల పోటీలో నర్సింహులపల్లి విద్యార్థి రాసిన "మూఢ నమ్మకాలు" కథకు చోటు దక్కింది. బాలల దినోత్సవం సందర్భంగా చిల్డ్రన్స్ ఎడ్యు కేషనల్ అకాడమీతోపాటు బాలచెలిమి పిల్లల మాసపత్రిక జాతీయ స్థాయి కథల పోటీలు నిర్వహించారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 714మంది తాము రాసిన కథలను పోస్ట్‌ద్వారా పంపగా, 16ఉత్తమ కథలను ఎంపికచేశారు. ఎంపికైన 16ఉత్తమ కథల్లో మండలంలోని నర్సింహులపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న గంగారపు శృతి రాసిన మూఢనమ్మకాలు కథకు చోటుదక్కింది. ఎంపికైన 16మంది విద్యార్థులకు డిసెంబర్ 22న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతితోపాటు షీల్డ్, ప్రశంసాపత్రం అందజేయనున్నారు. ఉత్తమ కథలను పుస్తకరూపంలో తీసుకురానున్నట్లు నిర్వాహకులు మణికొండ వేదకుమార్, గరిపెల్లి అశోక్ తెలిపారు. పిల్లలు రచనలు చేసేలా కృషిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు కందుకూరి భాస్కర్‌ను ఎంఈవో పి ప్రభాకర్ అభినందించారు. విద్యార్థి శృతిని ఉపాధ్యాయులు రమేష్, నరేందర్, ఆంజనేయులు, పుష్పలత, శ్రీనివాస చక్రవర్తి, రామచంద్రారెడ్డి, సతీష్ కుమార్, సీఆర్పీ శ్రీలత అభినందించారు.

ఆర్చరీలో చికితకు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్‌తో చికిత

ఎలిగేడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత ఖేలో ఇండియా ఆర్చరీలో గోల్డ్ మెడల్ సాధించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఖేలో ఇండియాలో భాగంగా యూనివర్సిటీ స్థాయిగేమ్స్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన ఆర్చరీ పోటీల్లో ఆమె బంగారం పతకం సాధించి, రాష్ట్రానికి, జిల్లాకు పేరు తీసుకు వచ్చింది. ఈ మేరకు ఎమ్మెల్యే విజయరమణరావు బంగారం పతకం సాధించిన చికితను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీసర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎలిగేడు మాజీ ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావుతోపాటు పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తూ చికితను అభినందనలతో ముంచెత్తారు.

ఇండియన్ నేవీ సబ్ లెఫ్టినెంట్‌గా గంభీరావుపేట యవకుడు



నిహాంత్‌గౌడ్

గంభీరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన నిహాంత్‌గౌడ్ అనే యువకుడు ఇండియన్ నేవీ సబ్‌లెఫ్టినెంట్‌గా ఎంపికయ్యాడు. విశాఖపట్నంలో శనివారం నిహాంత్‌గౌడ్ విధుల్లో చేరారు. నిహాంత్‌గౌడ్ 6వతరగతి నుంచి ఇంటర్‌వరకు కోరుకొండ సైనిక్‌స్కూల్‌లో విద్యనభ్యసించాడు. ఇంటర్ పూర్తిచేశాక పూణేలోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ మూడేళ్లపాటు శిక్షణ పొందాడు. తరువాత ఇండియన్ నేవల్ అకాడమీలో ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నాడు. తాజాగా ఇండియన్ నేవీ సబ్‌లెఫ్టినెంట్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా నిహాంత్‌ను తల్లిదండ్రులు, బంధువులు అభినందించారు. గంభీరావుపేటలో తన స్నేహితులు ఆనందం వ్యక్తం చేశారు.

హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయం తనిఖీ


హుజూరాబాద్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని అడిషనల్ డీసీపీ వెంకటరమణ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. చల్లూర్ వంటి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇటీవల జమ్మికుంట ప్రాంతంలో జరిగిన హత్య కేసు దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏసీపీ మాధవి, సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ

లెక్క దాటొద్దు..

- ప్రతి పైసా లెక్క చెప్పాల్సిందే
- ప్రచారంపై నిరంతరం నిఘా కన్ను
- మండలాల వారీగా వ్యయపరిశీలకుల నియామకం
- ఎంసీసీ అమలుకు పకడ్బందీగా చర్యలు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పంచాయతీ ఎన్నికల పోరుకు తెరలేచింది. తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆదివారం రెండోవిడత మొదలైంది. నామినేషన్లు దాఖలు నుంచి అభ్యర్థులు ఖర్చులకు వెనుకాడకుండా గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తుంటారు. ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చుపెట్టే ప్రతి పైసా లెక్క చెప్పాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం మాత్రం ఖర్చు పరిమితిపై నిఘా పెట్టింది. ఎన్నికల ప్రచార ఖర్చుకు పరిమితి, నిబంధనలను రూపొందించింది. పరిమితికి మించి ఖర్చు చేసే అభ్యర్థులపై వేటు తప్పదు. ఇందు కోసం అభ్యర్థుల ఖర్చుల పరిశీలనకు మండలాల వారీగా వ్యయపరిశీలకులను నియమించారు. ఎన్నికలను పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి. దీంతో ధన, పలుకుబడి ఉన్న అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారు. వీరితో పాటు పార్టీలకు సంబంధం లేని వారు కూడా అనేకమంది బరిలోకి రావడానికి సిద్ధమవుతున్నారు. పోటీ చేసే అభ్యర్థులు మాత్రం ఎన్నికల సంఘం విధించిన ఖర్చు పరిమితికి లోబడే ఉండాలి.

● చికెన్ బిర్యానీ రూ 100. మటన్ రూ. 120

లస్సీ, సాఫ్ట్ డ్రింక్ ఒకటి రూ 10, వాటర్ ప్యాకెట్ ఒక రూపాయి, వాటర్ బాటిల్ రూ 20, వాటర్ క్యాన్ 20లీటర్లు రూ10, టీ రూ 5, కాఫీ రూ 10, బ్రేక్ ఫాస్ట్ రూ 35, వెజిటేబుల్ ప్లేట్ భోజనం రూ.50, నాన్ వెజిటేబుల్ ప్లేట్ రూ. 100, చికెన్ బిర్యానీ రూ. 100, మటన్ బిర్యానీ రూ. 120, పెద్ద సమోసా ఒక టి రూ 6, చిన్న సమోసా రూ 2, ప్లేట్ మిర్చి, బజ్జీ, పకోడి రూ. 20, లెమన్ బియ్యం ప్లేట్ రూ.40 ధరలను నిర్ణయించారు. పంచాయతీ ఎన్నికల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, ప్రచా రానికి అభ్యర్థుల ఖర్చులపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేశారు.

● సర్పంచ్‌కు రూ. 1.5లక్షల నుంచి రూ 2.5 లక్షలు

ఐదు వేల జనాభాలోపు గ్రామాల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థి రూ1.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 30 వేలు, 5 లక్షలపైగా ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థి రూ 2.50 లక్షలు, వార్డు సభ్యుడు రూ 50 వేలు ఖర్చు పరిమితి ఉంది. ఎన్నికల సామగ్రికి లెక్క ఉంది ప్రచారానికి ఉపయోగించే సామాగ్రికి లెక్క ఉంది. 76 రకాల సామగ్రికి రేట్లు ఎన్నికల సంఘం నిర్ణయించింది. రోజుకు లౌడ్ స్పీకర్ అద్దె 100 వాట్స్ రూ.500, 200 వాట్స్‌కు రూ 1300, డీజేకు రూ.2 వేలు, ఎల్ఈడీ స్క్రీన్‌కు సైజ్‌ను బట్టి ఒకరోజు కిరాయి రూ.5 వేల నుంచి 12 వేలు, వాహనంపై ఎల్ఈడీ అమర్చితే రూ.8 వేలు నుంచి 20 వేల వరకు చార్జీలు నిర్ణయించారు. వీడియోగ్రాఫర్ కెమెరాతో కలిపి నెలకు రూ 22,050, డ్రోన్ కెమెరాకు ఒక రోజు రూ3,500, ఆడియో క్యాసెట్ రికార్డు రూ 2,500, ఆటోతో రూ 3 వేలు, నలుగురైదుగురు కూర్చునే వేదిక రోజుకు రూ 150 నుంచి రూ 2800 వరకు ఉంది. క్లాత్ బ్యానర్లు ఫీట్లలో సైజ్‌ను బట్టి రూ. 9 నుంచి రూ 13 వరకు, ఫ్లెక్సీ బ్యానర్లు స్క్వైర్‌పీట్ రూ. 7 , హోర్డింగ్ ఫ్లెక్సీ రూ5 వేల నుంచి రూ 6వేల వరకు ధర నిర్ణయించారు.

ఒక బ్యాడ్జీ రేటు రూ 10, పోస్టర్లలో మల్టీకలర్ సంఖ్యను బట్టి రూ 8,500 నుంచి 75 వేలు , పూల దండ చిన్నది రూ 50, కలర్ పేపర్లతో రూ 150,పూలతో రూ 400 ,కరపత్రాలు ఇకటి రూపాయి,శాలువ రూ 50, ప్లకార్డులు రూ 25, జెండాలు రూ 5 నుంచి రూ 18 వరకు, డ్రైవర్‌తో కలిపి కారు, జీపు,టెంపో, ట్రక్, వాహనాల అద్దె రూ 2500, ఇన్నోవా,సూమో రూ. 3500, కారు రూ 2 వేలు, మూడు చక్రాల వాహనం రూ850, డిసిఎం వ్యాన్ రూ 3వేలు, మినీ బస్ 25 సీట్ల పరిమితి రూ4500, టాటా ఏసీ వాహనం రోజుకు రూ 1600, బోలెరో రూ 3000, డీలక్స్ రూ 2,200, సాధారణ గది రూ 1,200, ఏసీ ఫంక్షన్ హాల్ కుర్చీలతో అర్బన్‌లో రూ 15 వేలు, రూరల్‌లో ఏసీ ఫంక్షన్ హాల్ రూ 10 వేలు, అర్బన్‌లో ఏసీ లేని ఫంక్షన్ హాల్ రూ8 వేలు, రూరల్‌లో ఏసీ లేని ఫంక్షన్ హాల్ రూ 10 వేలు, టెంట్ బట్టి రూ800, సైడ్‌వాల్స్ రూ 30,కార్పెట్లు రెడ్ రూ 350,పెద్ద సైజ్ గ్రీన్ రూ 600 నిర్ణయించారు.

కార్పొరేట్ కళాశాలల మోసం

గణేశ్‌నగర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్మీడియెట్ కళాశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని జాతీయ బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ ఆరోపించారు. శనివారం తెలంగాణ ఇంటర్మీడియెట్ బోర్డుకార్యదర్శి శ్రీకృష్ణ ఆదిత్యకు ఫిర్యాదు చేశారు. అనంతరం మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్ల పేరిట దోపిడీ చేస్తున్నాయని, స్క్రీనింగ్‌టెస్టులు నిర్వహిస్తున్నాయని మండిపడ్డారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థికభారం మోపుతున్నాయన్నారు. ఒకే పేరుతో అనుమతి తీసుకొని దానికి అదనంగాబ్రాంచ్‌లు నడుపుతున్నాయ న్నారు. నిబంధనలు పాటించని కళాశాలల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం స్వల్పంగా నీరు వస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 1,338క్యూసెక్కుల వరదవచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 457 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 80.501 టీఎంసీలు కాగా అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది. ప్రాజెక్టులోకి ఈ యేడాది జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు 948.168 టీఎంసీల నీరు వచ్చిచేరగా, ప్రాజెక్టు నుంచి 880.455 టీఎంసీలనీరునుదిగువకు వదిలారు.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీరు

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

- సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల పోరాటాల ద్వారానే హక్కులు సాధిస్తామని సీపీఐ జాతీయనాయకుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల మహాలింగేశ్వర ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు జరిగే ఏఐటి యూసీ అనుబంధమైన ఆల్ ఇండియా బీడీ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను ఏఐటీ యూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంటి బాలరాజు జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలోని 14రాష్ట్రాలలో బీడీపరిశ్రమల్లో 75లక్షలమంది బీడీ కార్మికులు పనిచేస్తున్నారన్నారు. బీడీ కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. 1965లో ఏఐటియూసి అనుబంధంగా బీడీవర్కర్స్ ఫెడరేషన్ కమిటీ ఏర్పాటైందన్నారు. అప్పటినుంచి అనేక ఐక్యఉద్యమాలు చేపడుతూ బీడీ కార్మికు లకు కనీస కూలీపెంపు, ప్రావిడెంట్ ఫండ్, బోనస్, సెలవు, పనిదినాలు, తదితర హక్కులు కాపాడుకోవటం కోసం పోరాటం చేశారన్నారు.

బీడీ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్న సందర్భంగా డిసెంబర్ 2వ వారంలో నిర్వహించే సేవ్ ఇండియా- సేవ్ బీడీ వర్కర్స్ నినాదంతో చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి గోవర్ధన్ మాట్లాడుతూ బీడీకార్మికులకు దేశవ్యాప్తంగా ఒకే వేతనం అమలుచేయాలన్నారు. ప్రతి వెయ్యి బీడీలకు రూ.300 ఇవ్వాలని, బీడీ పరిశ్రమలో కాంట్రాక్టు పద్ధతిని రద్దు చేయాలన్నారు. జాతీయ కౌన్సిల్ సమావేశంలో బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఇంచార్జి ఎస్. విలాస్, ఆల్ ఇండియా సిగార్, టొబాకో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్. కాశీవిశ్వనాథం, జాతీయ అధ్యక్షుడు కార్పర్ ఉగ్లే, జాతీయ ఉపాధ్యక్షులు నవాబ్, రాష్ట్ర బీడీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, బీడీ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కొక్కుల శాంత, అధ్యక్షులు కె. అనసూర్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు దేవదాసు, లక్ష్మన్, పోచమల్లు, శాంత, రాధ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ నాయకుడు చాడ వెంకట్‌రెడ్డి

ధర్మపురి, కొండగట్టుకు భక్తుల తాకిడి



ధర్మపురిలో అభిషేకాది పూజల్లో పాల్గొన్న భక్తులు



కొండగట్టు అంజన్న ఆలయ క్యూలైన్‌లో భక్తులు

ధర్మపురి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. భక్తులు కుంకుమార్చన, నరసింహహోమం, స్వామివారల నిత్య కల్యాణం జరిపించారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనెపోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావిచెట్టు, ఆంజనేయస్వామి వారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు. స్వామివారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, భక్తులకు సేవలు అందించారు.

అంజన్న సన్నిధిలో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాములవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

హాల్ టికెట్ల కోసం విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

తిమ్మాపూర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా విద్యార్థులకు ఫీజు చెల్లించాలని యాజమాన్యం హాల్‌టికెట్లను నిలిపివేసిందని శనివారం ఎస్ఎఫ్ఐ నాయకులు, కొందరు విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి కళాశాల ఆవరణలో ఆందోళన చేపట్టారు. దీంతో యాజమాన్యం విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చి పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వడంతో వివాదం సద్దు మణిగింది. అంతకు ముందు తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలకు కౌన్సెలింగ్‌లో ఫ్రీసీటు వచ్చిందనిచెప్పడంతో చేర్పించామన్నారు. ఇప్పు డేమో ఫీజులు చెల్లించమంటున్నారని వాపోయారు.

అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ తిమ్మాపూర్‌లోని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా చదువుతున్న విద్యార్థులను ఫీజులు కట్టాలని వేధిస్తు న్నారని ఆరోపించారు. ఈ విషయంపై వాగేశ్వరి కళాశాల యాజమాన్యాన్ని వివరణ కోరగా 2024సెప్టెంబరులో విద్యార్థులు 30వేల ఫీజు చెల్లించాలని జీవో విడుదలైందని, దానిపై పూర్తి క్లారిటీ ఇవ్వలేదని తెలిపింది. ఈ ఏడాది బీసీ, ఓసీలు రూ.15వేలు ఫీజు చెల్లించే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొంది.దీంతో కళాశాల ఫీజు రూ.15వేలు, యూనివర్సిటీ ఫీజు రూ.2100 మొత్తం రూ.17100 చెల్లించాలని 20రోజుల క్రితమే విద్యార్థులకు సమాచారమిచ్చామన్నారు. పరీక్షలు రాయకుండా విద్యార్థులను ఇబ్బంది పెట్టేందుకు హాల్ టికెట్‌లను నిలిపివేయలేదని, ఇంకా సమయం ఉందని ఆలోపు హాల్ టికెట్‌లను ఇచ్చే వారిమని తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు అసంపల్లి వినయ్‌సాగర్, జిల్లాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడిజిల్లా వాలీబాల్ శిక్షణ శిబిరం



శిక్షణ శిబిరంలో ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాలబాలికల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈనెల 24న జిల్లాకేంద్రంలోని మినీస్టేడియంలో అసోసి యేషన్ బాలబాలికల జట్లకు ప్రత్యేకంగా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటుచేసింది. శిక్షణ శిబిరానికి ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి బాలురజట్టులో 16మంది, బాలికలజట్టులో 16మంది క్రీడాకారులను ఎంపికచేశారు. వీరికివసతి కల్పించి ఉదయం, సాయంత్రం వాలీబాల్ కోచ్‌లు సంపత్‌కుమార్, జగన్ పర్యవేక్షణలో శిక్షణ ఇప్పించారు.

● నేటి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు..

జిల్లాకేంద్రం మినీస్టేడియంలో ఆదివారం నుంచి జరుగనున్న 8వతెలంగాణ రాష్ట్రస్థాయి జూని యర్స్ వాలీబాల్ పోటీలకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నాలుగు వాలీబాల్ కోర్టులను సిద్ధం చేశారు. రాత్రిసమయంలో వాలీబాల్ పోటీలకు ఆటకం లేకుండా లేకుండా ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో 10బాలురు జట్లు, 10బాలికలజట్లు పాల్గొంటున్నాయి. పోటీలలో పాల్గొంటున్న బాలబాలికలు 240,దాదాపు 50మంది అఫీషియల్స్‌కు స్టేడియం సమీపంలో వసతి సౌకర్యం కల్పించారు.

ఆల్ ఇండియా పోలీస్ మీట్‌కు వినీత్

హుజూరాబాద్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన హాకీ క్రీడాకారుడు మోటపోతుల వినీత్ ఆల్ ఇండియా హాకీ పోలీస్ మీట్‌కు ఎంపికయ్యాడు. డిసెంబరు 4నుంచి 15వరకు గుజరాత్ రాజకోట్‌లో మీట్ నిర్వహించనున్నారు. వినీత్ హైదరాబాద్‌లో స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ సందర్భంగా హుజూరాబాద్ హాకీ క్లబ్ అధ్యక్షుడు తోట రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు బండ శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, బొడిగె తిరుపతి, శంకర్, శ్యామ్, సజ్జు, సాయికృష్ణ, విక్రమ్, సాంబరాజు, వంశీ, వినయ్, పరబ్రహ్మం హర్షం వ్యక్తం చేశారు.



వినీత్

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెద్దపల్లి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ ఖోఖోపోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని నిట్టూరు పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో ఈనెల 28నుంచి 30తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాఠశాలలో చదు వుతున్న టీనా, బాలసాని సిర, భూషనవేణి వినయ్, సాగలసంజయ్‌లు పాల్గొంటున్నట్లు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

గంగాధర : గంగాధర మోడల్‌స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ నాగరాజు తెలిపారు. పాఠశాలకు చెందిన అక్షయ, అర్చన, సాన్విత ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రిన్సిపాల్ పద్మ, పీఈటీ నాగరాజు అభినందించారు.



ఎంపికైన నిట్టూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మ

కోనరావుపేట ఎన్నికల ఆర్వో సస్పెన్షన్

కోనరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏర్పాటు చేసి న స్థానిక సంస్థల ఎన్నికల నామి నేషన్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారిగా పని చేస్తున్న వెంకటేశ్వర్‌రావును సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు ఎంపీడీవో స్నిగ్ధ తెలిపా రు. కోనరావుపేటలో విధులు నిర్వర్తిస్తున్న రిటర్నింగ్ అధికారి ఎన్నికల నియమావళి ఉల్లంఘించంతో ఉత్తర్వులు జారీ అయిన ట్లు పేర్కొన్నారు. కోనరావుపేటలో రిటర్నింగ్ అధికారిగా వికాస్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి.

మహిళా శక్తి అభివృద్ధే లక్ష్యం



సర్టిఫికెట్లు అందిస్తున్న డాక్టర్ బీఎస్ రావు, జి రమేష్

సిరిసిల్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం,మహిళాశక్తిని మరింత అభివృద్ధి చేయడం మా ప్రధాన లక్ష్యమని హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్‌రావు అన్నారు. శనివారం సిరిసిల్లలో డాక్టర్ బీఎస్ రావు హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో, న్యాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికేట్లు అందజేశారు. న్యాక్ సంస్థతో కలిసి మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, గ్రామీణ మహిళలు ఆర్థికంగా ఏదుగుదలకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జి రమేష్,డాక్టర్ రాంకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట),నవంబరు29(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఈ నెల 30న సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అ ధ్యక్షుడు రాజిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా నాఫ్స్ కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య హాజరు కానున్నారని పేర్కొన్నారు.

చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంతడుపుల, తాళ్లపెల్లి గ్రామాలలో ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమాయోజన చెక్కులను ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ నూకాల రవి అందించారు. వంతడుపులకు చెందిన సావనపెల్లి విజయ మృతి చెందగా లస్మయ్యకు, తాళ్లపెల్లికి చెందిన తిప్పారపు మల్లేశం మృతిచెందగా కనుకవ్వలకు రూ.2లక్షల చొప్పున అందించారు.

ఇన్‌స్పైర్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఇల్లంతకుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక పోటీలకు ఇల్లంతకుంట విద్యార్థులు ఎంపిక అయ్యారు. జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన ప్రదర్శనలో మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన రేష్మ, సాత్విక, కేరళమాడల్ పాఠశాలకు చెందిన అర్లిన్‌లు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. హెల్త్ అండ్ హైజిన్ విభాగంలో ఒడ్నాల రేష్మ తయారు చేసిన స్మార్ట్‌గ్లాస్, సుస్థిర వ్యవసాయం అనే విభాగంలో పెంటల సాత్విక్ తయారు చేసిన స్మార్ట్ గ్రేయిన్ డ్రైయర్ ప్రాజెక్టులు ఉత్తమంగా నిలిచాయి. వ్యర్థ నిర్వాహణ అంశంలో అర్లిన్ ప్రతిభ కనబర్చగా రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. గైడ్ టీచర్లు మహేష్‌చంద్ర, మధుసూదన్‌రావు, బాలకృష్ణలు వ్యవహరించారు.

రుద్రంగి : జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ -విద్య వైజ్ఞానిక ప్రదర్శన 2025 రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేయగా రుద్రంగి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని ముక్కెర అక్షయ 9వ తరగతి విద్యార్థిని జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినట్లు ఎస్‌ఓ వనిత తెలిపారు.

చందుర్తి: మండలంలోని బండపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నుండి ఎస్. వర్షిత్ జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఆనందరెడ్డి శనివారం తెలిపారు. విద్యార్థి తయారుచేసిన ఫ్రీ ఎనర్జీ వాటర్ పంప్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. జిల్లా సైన్స్ అధికారి దేవయ్య, సెక్టర్ ఆఫీసర్స్ పద్మజ, శైలజ వర్షిత్‌కు మెమొంటో అందజేశారు. సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి గైడ్ టీచర్లుగా మహేష్, భూపతి వ్యవహరించారు.


నేడు మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవానికి ముస్తాబైన మల్లికార్జున స్వామి ఆలయం

చందుర్తి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామ శివారులోని మోహినికుంట శ్రీమల్లికార్జున స్వామి ఆలయం కల్యాణోత్సవానికి ముస్తాబైంది. ఆదివారం పండితులు కోమాళ్లపల్లి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారం పర్య అర్చకులు భద్రయ్య శర్మ తెలిపారు. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు భద్రయ్య శర్మ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ నాయకులు

చందుర్తి,నవంబరు 29:(ఆంధ్ర జ్యోతి): చందుర్తి మండలంలోని ఏనగల్, లింగంపేట గ్రామంకు చెందిన బిజెపి నాయకులు బీఆర్ఎస్ పార్టీలో శనివారం చేరారు. మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన బిజెపి నాయకులు ఆశనిపర్తి శోభా8-సుధాకర్, లింగంపేట గ్రామానికి చెందిన కొప్పుల నరేష్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య సమక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో కేడిసిసిబి డైరెక్టర్ జలగం కిషన్‌రావు,మాజీ ఏఎంసీ చైర్మన్‌లు దప్పుల అశోక్,ఏనుగుల శ్రీనివాస్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్, మాజీ ఉప సర్పంచ్ కుసుంబ జనార్దన్, మాదాసు ప్రసాద్,ముద్రకోల వెంకటేశం,పులి మనోహర్ లుపాల్గొన్నారు.

ఇల్లంతకుంట మండలంలో..

ఇల్లంతుంట : మండలంలోని ఒగులాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు విక్రుతి లక్ష్మారెడ్డి శనివారం మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపుకోసం కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు గుండేటి ప్రశాంత్, అల్వాల రాజేశం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొదటి విడత నామినేషన్లు



నర్సింగాపూర్‌లో నామినేషన్ వేసేందుకు క్యూ లైనులో అభ్యర్థులు



రుద్రంగిలో నామినేషన్ కోసం వేచివున్న అభ్యర్థులు

వేములవాడ టౌన్ : మొదటి విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పర్వం శనివారం ముగిసింది. వేములవాడ అర్బన్ మండలంలోని 11గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలకు మూడు రోజుల్లో 87నామినషన్‌లు , 104వార్డులకు 270 నామినేషన్‌లు దాఖలయ్యాయి. చివరి రోజు నామినేషన్ దాఖలుకు అనేకమంది అభ్యర్థులు క్యూకట్టారు. వేములవాడ అర్బన్ మండలంలోని 11గ్రామ పంచాయతీల్లోని సర్పంచ్ స్థానాలకు చింతల్‌ఠాణాలో 9, సంకెపల్లిలో 7, చీర్లవంచలో 9, కొడు ముంజలో 10, మారుపాకలో 11, రుద్రవరంలో 7, శభాష్‌పల్లిలో 9, అనుపురంలో 6, ఆరెపల్లిలో 6, చంద్రగిరిలో8, గుర్రవానిపల్లిలో 5 నామినేషన్‌లు దాఖలయ్యాయి.

వేములవాడ రూరల్: వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామపంచాయతీలకు సర్పంచ్ స్థానాలకు మొదటి రోజు 7 , రెండవ రోజు 33, చివరి రోజు 58 మొత్తం 98 నామినేషన్లు దాఖలయ్యాయి. 146 వార్డు మెంబర్లకు మొదటి రోజు 4, రెండవరోజు 59, చివరి రోజు 272 మొత్తం 335 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు.

రుద్రంగి: నామినేషన్ కొరకు మండలంలో మొత్తం నాలుగు క్లస్టర్లు రుద్రంగి, మానాల, బడి తండా, దేగావతండాలో ఏర్పాటు చేశారు. రుద్రంగి గ్రామపంచాయతీ పరిధిలో సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు ఆరు గంటల వరకు బారులు తీరారు. మండలంలో సర్పంచ్‌లకు రుద్రంగిలో 15, మానాలలో7, సర్పంచ్ తండాలో 3, గైదిగుట్టతండాలో 2 అడ్డాబోరండాలో 2, దేగవత్ తండాలో 4, వీరునితండాలో1, బడితండాలో3, రూప్లానాయక్ తండా1, చింతమణి తండాలో1, నామినేషన్లు వేశారు. మండలంలో 86 వార్డులకు 180 మంది వార్డు సభ్యుల నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీఓ నటరాజ్ తెలిపారు. రుద్రంగి మండలంలో ఇప్పటివరకు మూడు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి.

చందుర్తి : రాత్రి 8 గంటల వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించారు. గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ప్రజల కోసం నామినేషన్ల స్వీకరణ ఈనెల 27న ప్రారంభం కాగా 29న ముగిసింది. రెండు రోజులపాటు మందకొండిగా సాగిన నామినేషన్ల పర్వం చివరి రోజు అధిక సంఖ్యలో తరలివచ్చి సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు నామినేషన్లను వేశారు. నామినేషన్ల స్వీకరణకు సమయం సాయంత్రం 5 గంటల వరకే గడువు ఉండడంతో ముందస్తుగానే పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలకు చేరుకున్నారు. నామినేషన్‌ల సమయం ముగియడంతో కేంద్రాల గేట్లకు తాళాలు వేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో ఐదు గంటలలోపు ఉన్నవారికి కొన్ని కేంద్రాలలో టోకెన్లను అందజేసి రాత్రి 8 గంటల తర్వత కూడ నామినేషన్లను స్వీకరించారు. చందుర్తి మండలంలో సర్పంచులకు 112, వార్డు సభ్యులకు 397 నామినేషన్లు దాఖలైనట్లు అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ రాధ శనివారం తెలిపారు. మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉండగా, 19 సర్పంచ్ పదవులకు 174 వార్డులకు 394 నామినేషన్లు దాఖలయ్యాయి.

కోనరావుపేట : గ్రామ పంచాయతీ సర్పంచుల, వార్డు సభ్యుల ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ఘట్టం శనివారం రాత్రి వరకు కొనసాగింది, రాత్రి 9 గంటల వరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను స్వీకరించారు. చివరి రోజు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలంలో రెండో విడుత 30 గ్రామ పంచాయతీలు, 252 వార్డులకు ఆదివారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీనారయణ ఎన్నికల సిబ్బందికి అవగహన కల్పించారు.

రాజన్న ఆలయ ఉద్యోగులకు స్థానచలనం

వేములవాడ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయం, భీమన్న దేవాలయంలో 20మంది ఉద్యోగులకు స్థానచలనం కల్పిస్తూ శనివారం ఈవో రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. 10రోజుల్లోనే ఆలయ ఉద్యోగుల బదిలీల్లో మార్పులు, చేర్పులు చేశారు. ఈ నెల 19న 17మంది ఆలయ ఉద్యోగులను అంతర్గత బదిలీలు చేశారు. మళ్లీ అప్పటి బదిలీలను మార్పులు, చేర్పులు చేస్తూ 20మంది ఉద్యోగులకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 10రోజుల్లో రెండు ఉత్తర్వులు వెలువడడంతో ఈ బదిలీలైనా అమలవుతాయా అని ఆలయ ఉద్యోగుల్లో సందిగ్ధం నెలకొంది.

పల్లెల అభివృద్ధిని పట్టించుకోని వారికి గుణపాఠం చెప్పాలి

ఇల్లంతకుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధిని పట్టించుకోని పార్టీలకు గ్రామ పంచాయతీ ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల కోసమే రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుందన్నారు. కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఇల్లంతకుంట మండల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషిచేస్తున్నాడని పేర్కొన్నారు.ఈజీఎస్ కింద రూ. 1.30కోట్లు, ఎంపీ నిధుల ద్వారా 18బోర్లు వేయించారని పేర్కొన్నారు. మండలంలో డబుల్‌రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారని, విద్యార్థులకు సైకిళ్ళను, పదవతరగతి విద్యార్థుల ఫీజులు కట్టిన ఘనత సంజయ్‌కుమార్‌కు దక్కుతుందన్నారు. నిరుపేదలకు అందిస్తున్న బియ్యంలోను కేంద్ర ప్రభుత్వ వాటా ఉందన్నారు. మండల ఎన్నికల ఇంచార్జ్ ఏలేటి చంద్రారెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్, నాయకులు మ్యాకల మల్లేశం, బత్తిని సాయగౌడ్, దేశెట్టి శ్రీనివాస్, ముత్తవ్వ పాల్గొన్నారు.

వేములవాడలో ఘనంగా దీక్షా దివస్



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

వేములవాడ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి మాట్లాడుతూ నవంబరు 29, 2009న తెలంగాణ రాష్ట్ర సాధన ధ్యేయంగా కేసీఆర్ అమరణ నిరాహార దీక్షకు దిగారని పేర్కొన్నారు. 11రోజుల పాటు చేసిన అమరణ నిరాహార దీక్షతో కేంద్రం దిగి వచ్చిందన్నారు. మళ్లీ ఇచ్చినట్లే తెలంగాణ ఇచ్చి వెనక్కి తగ్గడంపై రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం లేచిందన్నారు. దీక్ష దివస్‌ను పురస్కరించుకొని వేములవాడలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలను వేసి అమరవీరులకు ఘన నివాళి అర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ కార్యదర్శి కందుల క్రాంతికుమార్, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు గోస్కుల రవి, మాజీ కౌన్సిలర్‌లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, సిరిగిరి రాంచందర్ , జోగిని శంకర్, గన్నమనేని రామారావు, ముద్రకోల వెంకటేశం, నాయకులు నీలం శేఖర్, కొండ కనుకయ్య, కమలాకర్‌రెడ్డి, ఇ. సత్యానారాయణరెడ్డి, వెంగల శ్రీకాంత్‌గౌడ్, మల్లేశం, వాసాల శ్రీనివాస్, గుడిసె సదానందం, రాధాకిషన్‌రావు, రాంబాబు, అంజత్ పాషా, భాస్కర్, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



కాంగ్రెస్‌లో చేరుతున్న మర్తన్నపేట గ్రామ నాయకులు



ఎమ్మెల్యే కవ్వంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

కోనరావుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామానికి చెందిన 20 మంది గ్రామస్థులు శనివారం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కార్యాలయ ఆవరణలో కాంగ్రెస్ పార్టీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు హైదర్, శ్రీనివాస్, రామచంద్రం తదితరులు ఉన్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని పత్తికుంటపల్లె గ్రామానికి చెందిన నాయకులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో గాలిపెల్లి ప్యాక్స్‌డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, నాయకులు శేఖర్, జుట్టు మనోహర్, వినోద్, లక్ష్మన్, అశోక్, మధు, నరేష్, నవీన్, అభిలాష్ తదితరులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరగా ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, మండల ఉపాధ్యక్షుడు ఎలుక రామస్వామి, నాయకులు తిరుపతి, నగేష్, నర్సింహ్మారెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

జోరుగా పల్లెపోరు

(5వ పేజీతరువాయి)

జనరల్ 51, కేటాయించారు. 147 జనరల్ స్థానాల్లో 64 మహిళలకు 83 జనరల్ ఉన్నాయి. తంగళ్లపల్లి మండలంలో 252 వార్డుల్లో 105 మహిళలు, 147 జనరల్ ఉన్నాయి. ఇందులో ఎస్టీలకు స్థానాలు లేవు. ఎస్సీలకు 50 స్థానాలు ఉండగా 18 మహిళ లు, 32 జనరల్‌కు ఉన్నాయి. బీసీలకు 76 కేటాయించగా 34 మహిళలు, 51 జనరల్ ఉన్నాయి. 147 జనరల్ స్థానాల్లో 122 మహిళలు,172 జనరల్ ఉన్నాయి.

రెండో విడతలో 1,11,129 మంది ఓటర్లు

జిల్లాలో 3,53,351 మంది ఓటర్లు ఉండగా మొదటి విడత ఎన్నికల్లో 1,14,282 మంది ఓటు హక్కు వినియోగించుకోనుండగా రెండో విడతలో 1,11,129 మంది ఓటు వేయనున్నారు. ఇందులో 53,792 మంది పురుషులు ఉండగా 57,337 మంది మహిళలు ఉన్నారు.

పరామర్శ

ఇల్లంతకుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెనుగువారిపల్లె గ్రామానికి చెందిన వంచ రవీందర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కుటుంబీకులను పరామర్శించారు. శనివారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని మృతుడి పాడెమోశారు.జడ్పీమాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, మీసరగండ్ల అనిల్‌కుమార్ ఉన్నారు.

నివాళులు

తంగళ్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన మాజీ మావోయిస్టు సిద్ధన్నకు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, నాయకులు పడిగెల రాజు తదితరులు నివాళులర్పించారు. దుబాయ్‌లో ఉన్న సిద్దన్న కొడుకు అశోక్ శనివారం ఉదయం స్వగ్రామానికి చేరుకోగా అంత్యక్రియలు నిర్వహించారు.

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

ఇల్లంతకుంట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్లు వేయడానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు అసిస్టెంట్ డిస్ట్రిక్ ఎలక్షన్ అథారిటీ శశికళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇల్లంతకుంట, ముస్కానిపేట, తాళ్లపెల్లి, పొత్తూరు, వంతడుపుల, రేపాక, గాలిపెల్లి, అనంతారం, వెల్జిపూర్, పెద్దలింగాపూర్, అనంతగిరి గ్రామాలలోని క్లస్టర్ నామినేషన్ కేంద్రాలలో కేటాయించిన గ్రామాల వారు నామినేషన్లు వేయాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డివేణి గోపి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రెడ్డవేణి గోపి

బోయినపల్లి నవంబరు 29(ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డివేణి గోపి అన్నారు. బోయినపల్లి మండల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కూలీలకు ఉపాధి కల్పించేందుకు వంద రోజుల పనితో పాటు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ భవన నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందన్నారు. మరెన్నో పథకాలను గ్రామాల అభివృద్ధికి బిజెపి ప్రభుత్వం దృఢ సంకలంతో పనిచేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధుల నుండి అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటిన గ్రామాల్లో పైసా కేటాయించలేదన్నారు. భారతీయ జనతా పార్టీ బలపర్చిన అభ్యర్థిని గెలిపిస్తే కేంద్రమంత్రి బండి సంజయ్ గ్రామ అభివృద్ధికి పది లక్షల నిధులను. ఈ సమావేశంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఎడపల్లి పరశురాములు, నాయకులు శ్రీనివాస్, ఉదారి నరసింహ చారి, గుడి రవీందర్ రెడ్డి, క్యాతం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో భక్తుల సౌకర్యాల పరిశీలన



పల్లకి సేవలను పరిశీలిస్తున్న ఈవో రమాదేవి

వేములవాడ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): వేములవాడ భీమేశ్వరాలయంలో భక్తుల రద్దీ సందర్భంగా నెలకొన్న సౌకర్యాలపై శనివారం ఆలయ ఇవో రమాదేవి పరిశీలించారు. ఆలయంలో ప్రారంభించిన సేవా టికెట్లు, క్యూలైన్‌లు, తదితర ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆలయ సిబ్బందిని ఆదేశించారు.

రాజరాజేశ్వరాలయం అనుబంధమైన తిప్పాపూరం గోశాలను శనివారం ఆలయ ఇవో ఎల్. రమాదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. గోశాలలో గోవులకు అందిస్తున్న పశుగ్రాసం, మెడిసిన్, తదితర ఆరోగ్య పరిస్థితులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చలికాలంలో గోవులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నేటినుంచి గీతాజయంతి ఉత్సవాలు

రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం నుంచి వచ్చే నెల 2 గీతా జయంతి ఉత్సవాలు నిర్వహించుటకు ఏర్పాట్లు చేశామని ఈవో రమాదేవి శనివారం తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి మూడు రోజుల పాటు ఉదయం మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు, గీతాహోమం, నాగిరెడ్డి మండపంలో ఏకాంతసేవ నిర్వహించనున్నారు.

పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పీపీ శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పిల్లల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, ఏ అనుమానాస్పద పరిస్థితులుంటే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సిరిసిల్ల జిల్లా పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్యకలాపాలల్లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి పి.లక్ష్మణాచారి సమన్వయంతో సిరిసిల్ల పట్టణంలోని మహర్షి ఉన్నత పాఠశాలలో శనివారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో కోర్టు ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలపై లైంగిక నేరాల నివారణ, పోక్సో చట్టం కింద ఉన్న కఠిన శిక్షలు, బాధిత పిల్లల హక్కులు ఫిర్యాదు బాధ్యత వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బూర శ్వేత, లోక్ అదాలత్ సభ్యులు ఆడెపు వేణు, గుర్రం అంజనేయులు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోతి, ప్యానెల్ అడ్వకేట్ అరుణ పాల్గొన్నారు.

ముత్యాల పోచమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ఇల్లంతకుంట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామ ముత్యాల పోచమ్మ ఆలయ హుండీని లెక్కించారు. ఆలయ ప్రాంగణంలో శనివారం జరిగిన 8 నెలల హుండీ లెక్కింపులో రూ 10.36లక్షల నగదు వచ్చింది. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కొలపురి అంతగిరి, డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఈఓ మారుతిరావు, ధర్మకర్తలు ముత్తయ్య, శంకర్, పోచవ్వ ఉన్నారు.

సామాజిక మాధ్యమమే అస్త్రం

- తీరుమారిన ప్రచారం



ఎల్లారెడ్డిపేట, నవంబరు 29: పంచాయతీ ఎన్నికలంటేనే చుట్టూ మంది.. ఎంత మంది మన వెంట ఉంటే అంత బలం ఉన్నట్లు ప్రచారం సాగేది. ఒకరు, ఇద్దరు కలిసిన చోట ముచ్చట్లుండేవి. ఎక్కడ చూసినా గూమికూడి ఎన్నికల పోటీలో నిలిచే అభ్యర్థుల గురించి చర్చలు సాగుతుండేవి. మాటలతో చేసే పనులన్నీ చెప్పేవారు. కానీ ప్రస్తుతం పల్లెల్లోకి స్మార్ట్ ఫోన్ చేరడంతో అభ్యర్థులు తాము చేసే పనులు గ్రూపుల్లో సందేశం పోస్టు చేస్తున్నారు. జనం వేసే ప్రశ్నలకు అభ్యర్థులు ఫోన్‌లోనే తమ సమాధానాలు చెపుతున్నారు. ఎన్నికల సమయం గడువు తక్కువ ఉండడం వల్ల ప్రచార గుబులు పట్టుకుంది. ఓటర్లందరినీ కలిసే సమయం ఎట్లా అనే ఆందోళన నెలకొంది. సర్పంచ్, వార్డు స్థానాలకు బరిలో నిలిచే ఆశావహులు తమ చేతిలోని సెల్‌ఫోన్‌ను ప్రచార కేంద్రంగా మలుచుకుంటున్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో మొత్తం 43 సర్పంచు, 358 వార్డు స్థానాలకు మూడో విడత ఎన్నికలు జరుగనున్నాయి. గ్రామాల్లో సర్పం చ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే ఆశావాహులు తమ సెల్‌ఫోన్ల ద్వారా చేసే పనులు, గ్రామంలో సమస్యలపై చేసిన పోరాటాలను వివరిస్తూ వాట్సప్ గ్రూప్‌ల్లో సందేశాలు పంపుతున్నారు. దీంతో పాటు ఆలయ నిర్మాణాలకు విరాళాలు, సంఘాలకు డబ్బుల పంపిణీని కోడ్ భాషలో పేర్కొంటూ ఆకట్టుకుంటున్నారు.